హామీ.. నెరవేర్చరేమీ!

- 'తల్లికి వందనం' కోసం మహిళాలోకం ఎదురు చూపు
- ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని హామీ
- జీఓ 29లో ప్రతి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేసేలా మార్గదర్శకాలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ధర్మవరం/ కదిరి/ పుట్టపర్తి: దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పథకంగా గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమ్మఒడి పథకం పేరొందింది. పిల్లల్ని బడులకు పంపే తల్లుల ఖాతాలలో అప్పటి సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఏటా రూ.15 వేలు ఖాతాల్లో జమ చేసేవారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో గత ఐదేళ్లలో మహిళలు భారీగా లబ్ధి పొందారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీలు ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలో రాష్ట్రం తరపున చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ పథకంలో భాగంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే ఇంటర్‌లోపు వారందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆలస్యమవుతోంది. ప్రతి ఏటా జూన్‌లో అందాల్సిన నిధులు జూలై చివరికి వస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందిస్తూ ఇచ్చిన జీఓ 29లో పిల్లల్ని బడులకు పంపే తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏది ఏమైన ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని మహిళలు కోరుతున్నారు. ఎలాంటి నిబంధనలు విధించకుండా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభంలోనే వేసేది



పాఠశాలల ప్రారంభంలోనే గత ప్రభుత్వం అమ్మ ఒడి వేసేది. పాఠశాలలు ప్రారంభమై నెల కావొస్తున్నా ఇంత వరకు మా అకౌంట్‌లో జమ కాలేదు. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికి తల్లికి వందనం వేస్తే రూ.30 వేలు జమయ్యేది.

వి. అనూష. బి.కొత్తపల్లి. తలుపుల మండలం

త్వరగా ఇస్తే బాగుంటుంది



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అందరికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చెప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. నాకు ఇద్దరు కుమార్తెలు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. త్వరగా డబ్బు వేస్తే మా పిల్లలను బాగా చదివించుకుంటాం.

– గౌసియా పట్నం గ్రామం కదిరి మండలం

మాట నిలబెట్టుకోవాలి



నాకు ఇద్దరు పిల్లలున్నారు. వారు బండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతున్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తానని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఒక్కరికే ఇస్తామని జీఓ విడుదల చేయడం సరి కాదు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– శ్యామలమ్మ, భైరాపురం గ్రామం, కొత్తచెరువు మండలం

నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు			
మండలం	ప్రభుత్వ పాఠశాలలు	ప్రైవేట్ పాఠశాలలు	విద్యార్థులు
ధర్మవరం	100	61	31,072
తాడిమర్రి	36	5	3,000
ముదిగుబ్బ	72	16	9,637
బత్తలపల్లి	43	8	3,928
కదిరి	95	58	20,635
తలుపుల	70	06	3,972
తనకల్లు	82	06	4,353
నల్లచెరువు	52	05	3,632
గాండ్లపెంట	59	06	3,230
ఎన్పీకుంట	58	03	2,780
అమడగూరు	49	5	2,239
బుక్కపట్నం	42	5	3,642
కొత్తచెరువు	44	7	4,559
నల్లమాడ	57	6	3,929
ఓడిచెరువు	78	12	6,688
పుట్టపర్తి	48	20	7,962

ఎదురు చూస్తున్నా



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇస్తామన్న తల్లికి వందనం డబ్బు కోసం ఎదురు చూస్తున్నాను. నాకు ఇద్దరు కుమార్తెలు సునీత 7వ తరగతి, నికిత 5వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి జూన్ నెలలోనే ఇచ్చేవారు. ఈ పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చారు కాని నేటికీ డబ్బు ఇవ్వలేదు.

–హరిణి, సానేవారిపల్లి, ముదిగుబ్బ మండలం

ఇద్దరు పిల్లలకు వస్తుందో రాదో?



సీఎం చంద్రబాబునాయుడు 'తల్లికి వందనం' పథకం కింద కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా డబ్బు ఇస్తామని చెప్పారు. నాకు ఇద్దరు కుమార్తెలు ఎం.రసజ్ఞ, ఎం.అశ్వికను కదిరిలోని ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నా. ఇద్దరు పిల్లలకు ఫీజులు చెలించాల్సి ఉంది. పాఠశాలలు తెరచి నెలకు పైగా అయ్యింది. తల్లికి వందనం కింద ఇద్దరు పిల్లలకు వస్తుందో రాదో తెలియడం లేదు.

– ముక్తాపురం, శ్వేతా, ముద్దన్నగారిపల్లి, గాండ్లపెంట మండలం

ఏటా రూ.45 వేలు ఇస్తామన్నారు



ఎన్నికల్లో ముగ్గురు పిల్లలున్న తల్లులకు రూ.45 వేలు ఇస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. నాకు బడికి వెళ్లి చదువుకునే ముగ్గురు పిల్లలున్నారు. తల్లికి వందనం ద్వారా ఏటా రూ.45 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఎన్నో షరతులు పెట్టి ఒకరికి మాత్రమే అంటున్నారు. కూటమి చెప్పిన హామీల్లో సూపర్ సిక్స్‌లో ఇంకా చాలా ఉన్నాయి. వాటిలో కూడా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చరు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు ఈ ప్రభుత్వం బాగా బుద్ధి చెప్తోంది.

– భవ్య, శీతిరెడ్డిపల్లి, అమడగూరు మండలం

ముగ్గురికీ డబ్బు జమచేయాలి



నాకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకునే అమ్మాయి, 9 వ తరగతి చదువుకునే అబ్బాయి, 6 వ తరగతి చదువుకునే అమ్మాయి ఉన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా ముగ్గురికి ఏడాదికి రూ.45 వేలు ఇస్తామని చెప్పడంతో పెద్దమ్మాయి, అబ్బాయిని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించా. ఇప్పటికే ప్రైవేట్ బడుల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు తల్లి వందనం డబ్బు చేయాలి

–రమణమ్మ, అమడగూరు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి తల్లికీ ఎంత మంది బడికి వెళ్లే విద్యార్థులుంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. నేను వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాకు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే ఇద్దరు పిల్లలు ఉన్నారు ఇచ్చిన హామీ ప్రకారం నా ఇద్దరి పిల్లలకూ రూ.15 వేల చొప్పున ఇద్దరికీ రూ.30 వేలు నా ఖాతాలో జమ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– ఎస్.అమ్మజాన్,ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం:

ఫీజులు చెల్లించలేకున్నాం



మాకు ముగ్గురు పిల్లలు. అమ్మాయి హేమశ్రీ తనకల్లు గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. అబ్బాయిలు ధనుష్, దిలీప్‌కుమార్ ఓడీ చెరువులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ, 4వ తరగతి చదువుతున్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబునాయుడు తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తానన్నారు. ఆయన హామీ ప్రకారం మా ముగ్గురు పిల్లలకు రూ. 45 వేలు రావాలి. పాఠశాలలు తెరచి నెల రోజులు దాటింది. కాని తల్లికి వందనం డబ్బులు ఇంకా జమ కాకపోవంతో పిల్లల ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం.

వీ. భారతి, పరాకువాండ్లపల్లి, తనకల్లు

ఇంతవరకూ జమ కాలేదు



నాకు 1, 5 వ తరగతి చదువుకునే ఇద్దరు పిల్లలున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగా నా ఇద్దరి పిల్లలకూ తల్లికి వందనం పథకం ద్వారా రూ.30 వేలు వస్తుందని ఆశ పడ్డాను. అయితే పాఠశాలలు ప్రారంభించి నెల గడుస్తున్నా ఇంతవరకూ చిల్లిగవ్వ కూడా ఖాతాలోకి జమ కాలేదు. ఇద్దరు ప్రైవేట్ బడిలో చదువుకుంటున్నారు. ఇప్పుడు ఇద్దరికి ఫీజులు ఎలా కట్టాలో ఏమో.

– భారతి, చీకిరేవులపల్లి, అమడగూరు మండలం

క్లుప్తంగా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శిస్తున్న సమన్వయకర్త మక్బూల్

తలుపుల : గెరికపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మండల అగ్రి బోర్డు చైర్మన్ బి.చెన్నక్రిష్టారెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బిఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రబాస్కర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల గ్రామంలో జరిగిన గొడవల్లో చెన్నకృష్టారెడ్డి గాయపడ్డాడు. గురువారం గ్రామానికి చేరుకున్న వారు చెన్నకృష్టారెడ్డిని కలిసి భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, లీగల్ సెల్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకేబాబు, సర్పంచ్‌లు దివాన్‌వలి, షేక్షావలి, సీనియర్ నాయకులు రోశిరెడ్డి, సూరం స్వ్యానారాయణరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, బావాజి ఉన్నారు.

బ్యాగు అప్పగింత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న అశ్విని తన కుమారుడిని చూసేందుకు ఆటోలో యశోద పాఠశాలకు వెళ్లి బ్యాగు మర్చిపోయింది. అనంతరం టీచర్ అశ్విని వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా సిఐ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు మారుతి, దివాకర్‌లు స్కూల్ వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆటో డ్రైవర్ వద్దనున్న బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. బ్యాగుతోపాటు అందులో ఉన్న సెల్‌ఫోన్, ఏటీఎంలు అప్పగించిన పోలీసులకు టీచర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనామా

బత్తలపల్లి: సీపీఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆ పార్టీకి, పదవికి రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యర్రాయపల్లికి చెందిన వ్యక్తిగత కారణాలతో పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్‌కు సోషల్ మీడియా ద్వారా పంపినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఐఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు దండేపాల్

చెన్నేకొత్తపల్లి: భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని ఐఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు దండేపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సంఖ్య వాటి వివరాలను అక్కడే ఉన్న ఐఈఆర్టీ వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులు, మూమెంట్ రిజిష్టర్, లెసన్ ప్లాన్ తదితర వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రసస్త యాప్, సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఆనంద్ బాబు, మండల విద్యాశాఖ అధికారులు మున్వర్ బాషా, ప్రసూన్ కుమార్‌నాయుడు, ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఐఈఆర్టీ నాగేంద్ర ఉన్నారు.

సీఏ ఫలితాల్లో నల్లమాడ విద్యార్థి ప్రతిభ



హరీష్‌కుమార్

నల్లమాడ: సీఏ ఫలితాల్లో నల్లమాడకు చెందిన విద్యార్థి ఎంజేటి హరీష్‌కుమార్ (రోల్ నెం. 140379) ప్రతిభ చాటాడు. శుక్రవారం విడుదలైన సీఏ ఫలితాల్లో 52 శాతం మార్కులతో తమ కుమారుడు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు క్రిష్ణవేణి, వెంకటనారాయణ తెలిపారు. హరీష్‌కుమార్ పదో తరగతి నల్లమాడలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇంటర్ కొడిగనహళ్లిలోని గురుకుల పాఠశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించాడు.

వ్యక్తిపై దాడి

నల్లచెరువు: గాజేఖాన్ పల్లికి చెందిన త్రిలోక్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గురువారం దాడి చేశారు. ఎస్ఐ లింగన్న తెలిపిన వివరాలు..గాజేఖాన్ పల్లికి చెందిన త్రిలోక్‌నాథ్‌కు జనార్దన్, మహేష్, నాగేంద్రకు మధ్య డబ్బు విషయంలో గొడవ జరిగింది. ముగ్గురూ దాడి చేయడంతో త్రిలోక్‌నాథ్‌కు చేయి విరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంసీ నరసింహారెడ్డి వర్ధంతి

బత్తలపల్లి: ఈదుల ముష్టూరులో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ సమితి ప్రెసిడెంట్, ఎంసీ నరసింహారెడ్డి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఓబిరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణు నరసింహారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

మహాసమాధిని దర్శించుకున్న మంత్రులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ దర్శించుకున్నారు. గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామం టూరిజం హోటల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమీక్షకు వారు పుట్టపర్తికి విచ్చేశారు. ఉదయం 10 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. మంత్రులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు స్వాగతం పలికారు. మంత్రుల వెంట స్థానిక ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఉన్నారు.

పుట్టపర్తి: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల జేఏసీ నేతలు గురువారం పుట్టపర్తిలో మంత్రులు సత్యకుమార్, సవితమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని, సమ్మెకాలానికి కూడా జీతాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ధర్మవరం అర్బన్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ మాధవి ఆధ్వర్యంలో గురువారం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకూ బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. కుటుంబ ప్రణాళిక అనేది అభివృద్ధి చెందిన భారతదేశానికి కొత్త గుర్తింపు, దంపతులకు గర్వకారణమన్నారు.

ముదిగుబ్బ: యనుములవారిపల్లిలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ లక్ష్మీ నరసమ్మ, సిబ్బంది వినయ్‌కుమార్, మహబూబ్‌బాషా, గంగాదేవి, శైలజ, భార్గవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: దర్శనమల పీహెచ్‌సీలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతు చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమన్నారు. సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల గ్రాంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

తనకల్లు: ప్రతి పాఠశాలకు పాఠశాల నిర్వహణ గ్రాంటును వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈతోడు, కోటపల్లి, బొంతలపల్లి , నల్లగుట్లపల్లి ఉన్నత పాఠశాలు, చీకటిమానిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా స్కూల్ గ్రాంట్లు మంజూరు చేయకపోవడంతో పాఠశాలల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. విద్యుత్ చార్జీలు, టాయిలెట్లు, పాఠశాల మరమ్మతులు, టీఎల్ఎంల తయారీకి హెచ్ఎంలు చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీప్రసాద్, జిల్లా కౌన్సిలర్ ఎస్‌వీఎస్ ప్రసాద్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు జాఫర్, మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శులు జగదీష్, సుందర్, సుకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ అనంతరం పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతానికి ఉద్యోగుల సంక్షేమానికి ఈయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర నాయకులు నబీరసూల్, రీజనల్‌నాయకులు పద్మనాభరావ్,ఆర్ఎస్ఏరెడ్డి,దివాకర్, శంకర్ పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కార్మికుల సంక్షేమమే ఎంప్లాయిస్ యూనియన్ ధ్యేయమని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో గేట్ మీట్ ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. డిపో అధ్యక్షులు శ్రీనివాసులు, జోనల్ కమిటీ మెంబర్ శేఖర్, సీనియర్ కామ్రేడ్‌లు రమణప్ప, చిన్నప్పయ్య, డిపో సెక్రటరీ సాదిక్‌పీర్, గ్యారేజ్ కార్యదర్శి మోహన్, కార్మికులు మోహన్నాయక్, బీటీనాయక్, డిహెచ్‌నాయక్, ఆదెన్న పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమని డిపో సీనియర్ నాయకులు టిబి శ్రీరాములు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. యూనియన్ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, రీజనల్ జాయింట్ కార్యదర్శి బి.నరసింహులు, రీజనల్ నాయకులు బుల్లె ఆదినారాయణ, దూలెప్ప, డిపో కార్యదర్శి ముస్తఫా, గ్యారేజీ కార్యదర్శి మల్లికార్జున, టీఐ పెద్దక్క, ఏడీసీ నరసింహులు, సిస్టం సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ అంజలి

చెన్నేకొత్తపల్లి: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి కట్టుగా పని చేయాలని ఎంపీపీ అంజలి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వైద్య సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖలో చేపట్టిన పనులు వాటి వివరాలు తదితర వాటిని వివరించారు. గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సొంత నిధులు ఖర్చు చేసినట్లు కొందరు సర్పంచులు తెలిపారు. ఆ బిల్లులు ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్ తహసీల్దార హమీద్ బాషా, ఈఓఆర్డీ అశోక్ కుమార్ నాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల పహారా..

మండల సర్వసభ్య సమావేశం పోలీసుల పహారనడుమ సాగింది. గొడవలు జరిగే అవకాశం ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

విద్యుత్ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 7 గ్రామ సచివాలయాలు ఉన్నాయని 8 మంది విద్యుత్ సిబ్బంది ఉన్నా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడంలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీలు గంగోజమ్మ, భారతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ ఏఈతోపాటు సిబ్బంది పనితీరుపై సభ్యులు మండిపడ్డారు. జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ తల్లికి వందనంపై ఎంఈఓ క్రిష్టానాయక్‌ను ప్రశ్నించగా జీఓలో తల్లికి వందనం ఇస్తామని చెప్పారని అందరికీ వర్తిసుందని చెప్పారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సింగానివారిపల్లిలో గతంలో మంజూరైన అంగన్వాడీ కేంద్రం రద్దు చేశారని గ్రామంలో కేంద్రం మంజూరు చేయాలని సామాలగొంది సర్పంచ్ శివప్ప అధికారులను కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ అమరావతి,ఎంపీడీఓ రామానాయక్, వైస్ ఎంపీపీలు భారతి, గంగోజమ్మ, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, సోమశేఖరరెడ్డి, జయరామిరెడ్డి, లక్ష్మీదేవి, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

బత్తలపల్లి: ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఎరువుల దుకాణాలదారులను కదిరి ఏడీఏ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకుని వెళ్లాలని సూచించారు. బత్తలపల్లిలోని హనుమాన్ ట్రేడర్స్‌లో ఫిజికల్ స్టాక్, స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసం గల 27.935 మెట్రిక్ టన్నుల రూ.7,10,490లు విలువగల ఎరువులకు స్టాప్ సేల్ నోటీస్ జారీ చేసినట్లు వివరించారు. ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీఏఓ నాగార్జున ఉన్నారు.

తాడిమర్రి: ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కదిరి ఏడీఏ ఎస్.సత్యనారాయణ దుకాణదారులను హెచ్చరించారు. స్థానిక శ్రీనివాస ఫర్టిలైజర్, ఎస్వీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను గురువారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలంలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులు, పురుగు మందులను కలిపి అమ్మరాదని ఎరువుల దుకాణాల నిర్వాహకులకు తెలిపారు. ఈపాస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు తీసుకుని ఎరువులు విక్రయించాలన్నారు. ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఏఓ రమాదేవి, వీఏఏ విజయ్‌కుమార్, వీహెచ్ఏ గౌతమి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

చెన్నేకొత్తపల్లి: విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు సూచించారు. గురువారం మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న కేజీబీవీని సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉందంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా? రుచికరంగా ఉందా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థినుల కిట్లను పరిశీలించారు. కేజీబీవీ ఎస్ఓ సువర్ణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

పుట్టపర్తి: బుక్కపట్నం బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఒంగోల్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రహిమాన్ తెలిపారు. బుక్కపట్నంకు చెందిన రాఘవేంద్ర కుమార్తె సౌమ్య 10 వతరగతిలో 592 మార్కులు, గోపి కుమార్తె భువనేశ్వరి 569 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

టీకాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో 60 ఏళ్లు నిండిన వృద్ధులు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం కనుముక్కల సచివాలయం-2 పరిధిలోని ఆమిదాలకుంటలో ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ సిబ్బంది బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. డాక్టర్ రవినాయక్ వ్యాక్సినేషన్ క్యాంప్‌ను ఆకస్మికంగా పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ సాయిలీల, ఎంపీహెచ్ఏ శ్రీనివాసులు, ఏఎన్ఎం సుభాషిణి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పుట్టపర్తి: బుక్కపట్నంకు చెందిన సూరా రవీందర్‌రెడ్డి(50) గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి గ్రామానికి చేరుకుని రవీందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అధైర్యపడొద్దని అంటామని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మీ రాజు, వైస్ ఎంపీపీ పార్వతి పతంజలి, ఎంపీటీసీ పద్మావతీ ఈశ్వర్,సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, నాయకులు నల్లపరెడ్డి, రామకృష్ణారెడ్డి, మహేష్, నాగభూషణ, పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న కదిరప్ప

కదిరి టౌన్: శ్రీసత్య సాయి జిల్లాలోని అన్ని మండలాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాలు నిర్మించాలని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ కదిరప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఈ మెయిల్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. గురువారం ఆయన పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన పేద వర్గాల వారు శుభకార్యాలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకోసం అంబేద్కర్ భవనాలు నిర్మించాలని కోరారు.